సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



స్కూల్ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని ఇద్దరు మహిళలు గాయపడ్డారు. రణస్థలం మండలం రావాడ జంక్షన్‌లో ఈ ప్రమాదం జరిగింది. - 18లో



హోరాహోరీగా..

'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రేపటి నుంచి జూనియర్స్ పోరు ఆరంభం కానుంది. - 18లో

తెలుగు పీఠానికి రూ.30 లక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ప్రభుత్వం ఒడిశా రాష్ట్రంలో తెలుగు పీఠం ఏర్పాటుకు రూ.30 లక్షలు మంజూరు చేసిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు బుధవారం చెప్పారు. గతంలో రెండు రాష్ట్రాలు ఏపీలో ఒడియా పీఠం, ఒడిశాలో తెలుగు పీఠం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నాయని, దీనిలో భాగంగా ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. త్వరలోనే వర్సిటీలో ఒడియా పీఠం ప్రారంభిస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

10 నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు

మందస: బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. మందసలోని వాసుదేవపెరుమాళుని బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 17 వరకు నిర్వహించాలని వేద పండితులు ముహూర్తం నిర్ణయించారు. 14వ బ్రహ్మోత్సవాల వివరాలను వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు బుధవారం వివరించారు. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజజీయర్‌స్వామి, త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామిల పర్యవేక్షణలో ఈ నెల 10న ఉత్సవాలు ప్రారంభమై 17వ తేదీతో ముగుస్తాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక పూజలు, ఉపన్యాసాలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ప్రతి ధాన్యం గింజా కొంటాం



సచివాలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

నందిగాం: జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం నందిగాం, పెద్దతామరాపల్లి సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించకపోవడంపై వెల్ఫేర్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు. నందిగాం సచివాలయానికి వెళ్లే మార్గంలో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణాల పూర్తయినా కాంట్రాక్టర్లు భవనాలను సిబ్బందికి అప్పగించడం లేదని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం 3లక్షల 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మరో 20 శాతం ధాన్యం మాత్రమే రైతుల వద్ద ఉందని చెప్పారు. వాటిని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి, ఈఓపీఆర్డీ రాజారావు, మండల సర్వేయర్ జోగారావు, నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు గోధుమపిండి



గోధుమ పిండిని అందజేస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన గోధుమ పిండి పంపిణీని జిల్లాలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ బుధవారం ప్రారంభించారు. ఎం.డి.యు (మొబైల్ డిస్పెన్సరీ యూనిట్)ల ద్వారా ఇంటి వద్దకే బియ్యంతో పాటు నిత్యావసర సరకులను ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా కందిపప్పు, పంచదారతో పాటు ప్రతి కార్డుదారుడికి 2 కేజీలు గోధుమపిండి కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఏడురోడ్ల జంక్షన్ సమీపంలో గోధుమపిండి సరఫరా ప్రక్రియను జేసీ పరిశీలించారు. డీఎస్ఓ రమణ మాట్లాడుతూ రూ.80 విలువైన గోధుమ పిండిని సబ్సిడీపై రూ.32కే అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.వెంకటరావు, సీఎస్‌డీటీ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది సిద్ధార్థ, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ, అర్బన్ ఎండీయూ ఆపరేటర్లు మాధవ్, రాజా, చౌకధరల దుకాణం డీలర్లు గంగాధర్, అభిషేక్, తరుణ్ పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు కోచ్‌గా హరికృష్ణ



కె.హరికృష్ణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ వాలీబాల్ పోటీలకు జిల్లాకు చెందిన శాప్ వాలీబాల్ కోచ్ క్లోపల్లి హరికృష్ణ కోచ్‌గా నియమితులయ్యారు. అసోం రాష్ట్రం గౌహతిలో ఈ నెల 2 నుంచి 9 వరకు జరగనున్న 71వ ఆలిండియా సీనియర్ నేషనల్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా వాలీబాల్ జట్టుకు హరికృష్ణ కోచ్‌గా వ్యవహరించనున్నారు.

శ్వేతగిరి..భక్తజన సిరి

భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం జరిగిన శాలిహుండం యాత్ర భక్తజన సంద్రాన్ని తలపించింది. కాళీయ మర్దన వేణుగోపాలస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్వేతగిరి కిటకిటలాడింది. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు, లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను రెండు పల్లకిల్లో సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని వంశధార నదికి తీసుకువచ్చి చక్రతీర్థ స్నానాలు నిర్వహించగా.. భక్తులు సైతం స్వామివారిని కనులారా వీక్షించి పవిత్ర స్నానాలు ఆచరించారు. -గార





గోవిందా.. గోవింద!

- టీడీపీలో యూజ్ అండ్ త్రో పాలసీ..!
- మామిడి గోవిందరావుకు షాక్ ఇచ్చేలా తాజా నిర్ణయాలు
- 'మామిడి' వెంట వెళ్తున్న వారిపై వేధింపులు
- కార్యరూపం దాల్చిన అచ్చెన్న వ్యాఖ్యలు
- నెరవేరుతున్న 'కలమట' వంతం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : తెలుగుదేశం పార్టీలో యూజ్ అండ్ త్రో పాలసీ మరోసారి తెరపైకి వచ్చింది. పాతపట్నం టీడీపీలో 'చేతిచమురు'తో క్రియాశీలకంగా వ్యవహరించిన మామిడి గోవిందరావు విషయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలే నిజమయ్యాయి. పార్టీ కోసం ఎంత ఖర్చు పెడుతున్నా కూరలో కరివేపాకు మాదిరిగానే వాడుకుంటున్నట్టు మరోసారి స్పష్టమైంది. మామిడి వెంట తిరుగుతున్న వారిపై వేధింపులు ప్రారంభించి.. తనను కాదని వెళ్లితే టార్గెట్ చేయక తప్పదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ తన చేతల ద్వారా చూపిస్తున్నారు. అధినేతలు తన మాటకే విలువ ఇస్తారని టీడీపీ కేడర్‌కు సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పుడీ వ్యవహారం పాతపట్నం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

కేడర్‌కు వేధింపులు..

టీడీపీలో డబుల్ గేమ్ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మరో నేత మామిడి గోవిందరావు మధ్య ఆసక్తికర పోరు నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తనకే టిక్కెట్ వస్తుందనే విధంగా గోవిందరావు దూకుడుగా వెళ్తున్నారు. టీడీపీలో ఉన్న అరకొర కేడర్‌ను నయానో భయానో తనవైపు తిప్పుకుంటున్నారు. దీంతో అక్కడ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న కలమట వెంకటరమణ ఉనికి తగ్గింది. అటు లోకేష్‌ను, ఇటు చంద్రబాబును తరుచూ కలుస్తూ, వాటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వదులుతూ గోవిందరావు హడావుడి చేస్తున్నారు. అధిష్టానం వద్దే మామిడికే ప్రాధాన్యత ఉందని టీడీపీలో ఉన్న కార్యకర్తలు ఒక్కొక్కరిగా మామిడి వైపు వస్తున్నారు. ఈ పరిణామాలను గమనించిన కలమట ..ఇంకా వదిలేస్తే తన అస్థిత్వానికే ముప్పు తప్పదని గ్రహించి యాక్షన్‌లోకి దిగారు. కేడర్ చేజారిపోకుండా జాగ్రత్తపడ్డారు. తన నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలపై వేధింపులు మొదలు పెట్టారు. పార్టీ పదవులుండి...మామిడి వెంట వెళ్తున్న నాయకులపై వేటు వేయిస్తున్నారు. దానికొక ఉదాహరణగా ఎల్ఎన్‌పేట పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వెలమల గోవిందరావు తాజాగా మామిడి గోవిందరావు వెంట వెళ్లడంతో ఆయన పదవిని తొలగించారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్‌లకు చెప్పి హుటాహుటీన వెలమల గోవిందరావుకు ఉన్న మండల పార్టీ అధ్యక్ష పదవిని మెండ మనోహర్ అనే వ్యక్తికి కట్టబెట్టారు. దీంతో మామిడి వెంట ఉన్న వెలమల గోవిందరావు మరికొందరు నాయకులు ఎదురుదాడి చేసి కలమటపై ఆరోపణలు చేసినా అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. ఇదంతా చూస్తుంటే నిమ్మాడలో అచ్చెన్నాయుడు చెప్పినట్టు మామిడి గోవిందరావును వాడుకోవడానికే తప్ప అంతకు మించి ఏమీ లేదన్న వ్యాఖ్యల్ని నిజం చేస్తున్నట్టుగా జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ రోజు..మామిడి గోవిందరావుకు టికెట్ ఇచ్చే ఆలోచన లేదని.. కలలో కూడా ఊహించొద్దని...నీ కోసం వాడుకోవడానికే ఉపయోగిస్తున్నానని.. పార్టీ కోసం డబ్బులిస్తున్నాడు.. తరుచూ చెక్‌లు తీసుకొచ్చి ఇస్తున్నాడు.. చెక్ కాదు కదా ఆస్తి రాసిచ్చినా పార్టీకి వాడుకుంటాం.. వాడుకోవాలన్నదే నా ఉద్దేశమని కలమట వెంకటరమణకు అచ్చెన్నాయుడు చెప్పిన మాటలు ఇప్పుడు నిజమయ్యాయనిపిస్తోంది. మామిడి గోవిందరావు ఎంత ఖర్చు పెట్టినా, ఎవరి వద్దకు తిరిగినా మా మద్దతు నీకే అన్నట్టుగా కలమటకు అనుకూలంగా అధినేతలంతా వ్యవహరిస్తున్నారు. దీంతో పార్టీలో అంతర్గత పోరు మరింత ఎక్కువైనట్లయ్యింది.

విశాఖ రాజధానిపై సీఎం ప్రకటన హర్షణీయం

- బడుగు, బలహీనవర్గాలంటే చంద్రబాబుకు చిన్నచూపు
- విలేకరుల సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశాఖపట్నమే రాజధాని అంటూ ఢిల్లీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనను ఏపీ ప్రజలు ముక్తకంఠంతో స్వాగతిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. సీఎం ఎక్కడ ఉండి పాలిస్తే అదే రాజధానవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని, అవి ఉన్న ప్రాంతమైన విశాఖను రాజధానిగా చేయడం వల్ల పెట్టుబడిదారులకు మెరుగైన అవకాశాలు కలుగుతాయని వివరించారు. ముఖ్యంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి అధిక లాభం చేకూరి వలసల నివారణకు, అభివృద్ధికి మార్గం సుగమమవుతుందన్నారు. హైదరాబాద్ రాజధానిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో నిధులన్నీ ఒకే చోట పెట్టుబడిగా పెట్టడంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని, మళ్లీ ఆ ఘటనలు పునరావృతం కాకూడదన్నదే సీఎం లక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికలు పార్టీలు, వ్యక్తుల మధ్య కాదని.. పెత్తందారులకు సామాజిక, పేద వర్గాలకు మధ్య అని చెప్పారు.

80.39 శాతం పింఛన్ల పంపిణీ



శ్రీకాకుళంలోని 30వ వార్డులో సిల్లా భాగ్యవతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాణి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో తొలిరోజు బుధవారం 80.39 శాతం మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. మొత్తం 3,17,072 మంది లబ్ధిదారులకు గాను రూ.85.90 కోట్లు అందజేయాల్సి ఉండగా.. సాయంత్రం 7 గంటల వరకు 2,54,905 మందికి రూ.69.06 కోట్లు పంపిణీ చేశారు.

నిరాశపరిచిన నిర్మలమ్మ పద్దు !

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు సున్నా



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కేంద్ర బడ్జెట్ జిల్లాకు తీవ్ర నిరాశే మిగిల్చింది. జిల్లాకు సంబంధించి ఒక్క ప్రస్తావన కూడా తీసుకురాలేదు. రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడంతో జిల్లాలో కొంతమంది వేతనజీవులకు ప్రయోజనం చేకూరడం తప్ప జిల్లాకు ఒక సంస్థను గాని, ప్రత్యేక అభివృద్ధికి నిధులు గాని కేటాయించలేదు. ఒకప్పుడు వెనకబడిన జిల్లా అభివృద్ధి కోసం నిధులకేటాయింపులు జరిగేవి. ఇప్పుడా ఊసే ఎత్తలేదు. దీర్ఘకాలంగా ఉన్న ఉద్దానం కిడ్నీ సమస్యను కనీసం గుర్తించకపోవడంతో బాధితులకు నిరాశే ఎదురైంది. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవలో కనీసం భాగస్వామ్యమైన పరిస్థితి కూడా లేదు. ఉద్దానం కోసం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, భారీ మంచినీటి ప్రాజెక్టును నిర్మిస్తున్న రాష్ట్రానికి కేంద్రం తోడైతే మరింత ప్రయోజనకరంగా ఉండేది. విశాఖకు రైల్వే జోన్ వస్తే రైల్వే సేవలు పరంగా మన జిల్లాకు ఉపయోగం ఉండేది. ఆ విషయంలో జాప్యం చేస్తుందే తప్ప వాస్తవ రూపం దాల్చడం లేదు.

ఏకలవ్య పాఠశాలలకు మోక్షం..

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని.. దేశ వ్యాప్తంగా సుమారు 39 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రకటనతో జిల్లాలో మెళియాపుట్టికి మంజూరై, అక్కడ భవన లేమితో ప్రస్తుతం పాతపట్నంలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలకు మోక్షం కలిగే అవకాశముంది. అలాగే, ఉమ్మడి జిల్లాలోని భామినిలో ఉన్న ఏకలవ్య పాఠశాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

కేంద్ర బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ వర్గాల స్పందన గమనిస్తే..

నిరాశ కలిగించింది



కేంద్ర బడ్జెట్ 2023–24 నిరాశ కలిగించింది. గత ఏడాది నవంబర్‌లో విశాఖపట్నానికి ప్రధాని మోదీ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విభజన హామీలను ప్రస్తావించారు. ఆ ప్రస్తావనే బడ్జెట్‌లో లేదు. దేశంలో వెనుకబడిన జిల్లాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి కేటాయింపులూ లేవు.

– రెడ్డిశాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

ప్రత్యేక కేటాయింపులు లేవు



రాష్ట్ర విభజన నుంచి ఏపీకి బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేవు. విభజన హామీలు సైతం అసంపూర్తిగా నిలిచిపోయాయి. అయితే వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితి రూ.ఏడు లక్షలకు పెంచటం మధ్య తరగతి వారికి ఊరటనిస్తుంది. స్టాండర్డ్ డిడక్షన్ రూ. 2.5 లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచడం వల్ల ప్రయోజనం చేకూరుతుంది.

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పాలనా రాజధాని జేఏసీ చైర్మన్

మధ్య తరగతికి మేలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు ఊరటనిచ్చింది. పన్ను పరిమితి రూ.5లక్షలు నుంచి రూ.7లక్షలకు పెంచడం సంతోషంగా ఉంది. పన్ను పరిమితి నాడు ప్రణబ్ ముఖర్జీ పెంచగా..తాజాగా నిర్మలా సీతారామన్ రెండోసారి పరిమితి పెంచారు.

– మజ్జి చినబాబు, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యం



బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చారు. విద్యుత్, ఇంధన రంగం, 5జీ నెట్‌వర్క్, ఎయిర్‌పోర్టులు, హెలిప్యాడ్‌లు వంటి ఏర్పాట్లకు ప్రాధాన్యమిచ్చారు. బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకున్నారు. రైతులకు, మధ్య తరగతి వారికి ప్రయోజనకరంగా బడ్జెట్ రూపొందించారు. విద్యకు సైతం ప్రాధాన్యమిచ్చారు.

– గుంట తులసీరావు, విశ్రాంత ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వేతనజీవులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు ఇది విప్లవాత్మకమైన బడ్జెట్ కాదు. వేతనజీవులకు కొంత ఊరట పొందే బడ్జెట్‌గా భావించవచ్చును. ఆదాయ పన్ను పరిమితి పెంపు ఊరట కలిగించింది. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు ఆశాజనకరంగా లేవు.

– బొడ్డేపల్లి మోహనరావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

ఉద్యోగులకు నిరాశ..



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులకు తీవ్ర నిరాశను కలిగించింది. రూ.7లక్షలు లోపు ఎటువంటి టాక్స్ లేదని తెలిపారు. అయితే పాత విధానంలో ఉన్న హెచ్ఆర్ఏ, సీపీఎస్, 80సి, 80డిలు లేకపోవడం శోచనీయం. ఉద్యోగులకు ఏట వరాలు ఇచ్చినట్లు ప్రచారం చేయడం దారుణం.

– హనుమంతు సాయిరాం, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు

రాయితీలు తగ్గించారు..



ఆర్థికలోటు తగ్గటం మంచి పరిణామం. కొన్ని సెక్టార్లకు తక్కువ కేటాయింపులు చేశారు. ఎరువులు, నిత్యావసర ఆహార ధాన్యాలకు రాయితీలు తగ్గించారు. వ్యవసాయ కేటాయింపులు సైతం అనుకున్న స్థాయిలో లేవు. విద్య, ఇంటి నిర్మాణాలు, రోడ్డు రవాణాకు కేటాయింపులు బాగున్నాయి.

– ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వెలుగులనిద్దాం



జి.సిగడాం మండలం నిద్దాం గ్రామంలో బుధవారం రాత్రి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల ఆనవాయితీని కొనసాగిస్తూ నిద్దాలమ్మ యాత్ర సందర్భంగా లక్షా 50 వేల ప్రమిదలు వెలిగించారు. ఇందుకోసం రెండు వేల కేజీల నూనెను వినియోగించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర దీపారాధన చేపట్టారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కలిశెట్టి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరమణ, ఏర్నేన ప్రకాశరావు, సాధ్వీ మణి తదితరులు పాల్గొన్నారు. – జి.సిగడాం

ఆధునిక హంగులతో వైఎస్సార్‌సీపీ నూతన భవనం

- భూమిపూజ చేసిన కృష్ణదాస్ దంపతులు
- హాజరైన స్పీకర్ తమ్మినేని, మంత్రులు ధర్మాన, సీదిరి





శంకుస్థాపన పూజలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడు సమీపంలో జాతీయ రహదారిపై వరుణ్ మోటార్స్ వెనుక 1.5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించనున్న వైఎస్సార్ సీపీ కార్యాలయ భవన నిర్మాణానికి బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పద్మప్రియ దంపతులు భూమి పూజ చేశారు. కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ 1.5 ఎకరాల్లో అత్యంత ఆధునికంగా కార్యాలయం నిర్మిస్తామని తెలిపారు. మొదటి దశ పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. రోజంతా అందుబాటులో ఉండేలా కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజలకు, పార్టీకి అనుసంధానకర్తగా పార్టీ కార్యాలయం ఉంటుందన్నారు. సీఎం జగనన్న ఆలోచనలు సఫలీకృతం చేయడమే తమ లక్ష్యమన్నారు. త్వరితగతిన భవనాన్ని పూర్తిచేసి ఇక్కడి నుంచే పార్టీ కార్యకలాపాలు ప్రారంభిస్తామని కృష్ణదాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ సాయిరాజ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, కార్పొరేషన్ల చైర్మన్లు నర్తు రామారావు, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు,పేరాడ తిలక్, డి. లోకేశ్వర్ రెడ్డి, ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, తమ్మినేని చిరంజీవినాగ్, ఎం.వి.స్వరూప్, శిమ్మ రాజశేఖర్, డోల జగన్, కిల్లి రామ్మోహనరావు, ఎన్ని ధనుంజయరావు, గొండు రఘురాం, సిజు, ఆదినారాయణశాస్త్రి, డాక్టర్ దానేటి శ్రీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, రాజాపు అప్పన్న, కోరాడ ఆశాలతా గుప్తా, చింతాడ మంజు, సురంగి మోహన్‌రావు, ఇప్పిలి కృష్ణారావు, సుంకరి కృష్ణ, సీహెచ్ భాస్కరరావు, అంధవరపు సంతోష్, మార్పు పృథ్వీ పాల్గొన్నారు.

రియల్టర్ల రాజధానికి ఫుల్‌స్టాప్

- మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రియల్టర్ల రాజధాని అమరావతికి ఫుల్‌స్టాప్ పెట్టడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నూతన భవన శంకుస్థాపన నిమిత్తం హాజరైన మంత్రి విలేకరులతో మాట్లాడారు. అమరావతిలో చంద్రబాబు అండ్ కో రియల్ ఎస్టేట్ రాజధాని కోసం రాష్ట్ర ప్రజలను బలిచేయడం సరికాదన్నారు. విశాఖలో రాజధాని ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో సగం కేటాయించాల్సిన అవసరం ఉంటుందని, అదే విశాఖను ఎంచుకుంటే ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమవుతుందన్నారు. దీనికోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌కు ఉత్తరాంధ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీకి ప్రజలే బాదుడే బాదుడు చేస్తారని.. చంద్రబాబువల్లే రాష్ట్రానికి ఖర్మ పట్టిందన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలా ప్రజాదరణను పొందలేరన్నారు. లోకేష్ పాదయాత్రకు పట్టుమని పది మంది కూడా రావడం లేదని, ఎల్లోమీడియా తొలిరోజు హడావిడి చేసినా తర్వాత రాయడం మానేశాయని గుర్తు చేశారు.

క్లుప్తంగా

ప్రైవేట్ జాబ్ వద్దన్నారని..

శ్రీకాకుళం క్రైమ్: ప్రైవేట్ జాబ్ చేయడం అవసరమా? ప్రభుత్వ ఉద్యోగం చూసుకుంటే సంఘంలో విలువుంటుందని తండ్రి అన్నందుకు ఇంటి నుంచి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు పట్టణానికి చెందిన యువకుడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రెల్లి వీధికి చెందిన పోలిమహంతి దీపక్ (21) పట్టణంలోని మహేంద్ర కొటక్ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ విధానంలో కేవైసీ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పటిలాగే గత నెల 30న బ్యాంకు నుంచి విధులు నిర్వర్తించి దీపక్ ఇంటికి రాగానే.. తండ్రి సాంబశివరావు పైవిధంగా మందలించాడు. ఆ మరుసటి రోజు బ్యాంకుకు వెళ్తున్నానని చెప్పిన దీపక్ చీకటిపడినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెంది తెలిసిన వారందరి వద్దా వాకబు చేసిన ఆచూకీ లేదు. దీంతో బుధవారం రాత్రి దీపక్ తండ్రి రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: మాఘ శుద్ధ ఏకాదశి, భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి కల్యాణ సేవను అనివెట్టి మండపంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిపించారు. రూ.500 చెల్లించి సేవలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాష్, అర్చకులు ఇప్పిలి సందీప్‌శర్మ, ఇప్పిలి షణ్ముఖ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేనిలో నూతన కోర్సులు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో యువతకు ఉపాధి కల్పించే నూతన కోర్సులు ఫార్మసీ అసిస్టెంట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసెస్ అసోసియేట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసిన వారు, పదో తరగతి పాస్/ఫెయిలైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 75 రోజుల శిక్షణ కాలం పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 అనే నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆక్వా రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆక్వా రంగంలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న విద్యుత్ సబ్సిడీని ఎక్కువ మంది రైతులు లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ అన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాన్ ఆక్వాజోన్‌లోని చెరువులను కూడా ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకొని వచ్చి క్రమబద్ధీకరించడం ద్వారా మరింత మందికి విద్యుత్ సబ్సిడీ లభించే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖల పరిధిలోని ఆక్వా చెరువులతో పాటు నాన్ ఆక్వా చెరువులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలుగో తేదీలోగా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. దీని ద్వారా నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉన్న 392.06 ఎకరాల్లోని 252 మంది ఆక్వా రైతులు విద్యుత్ సబ్సిడీ, ప్రభుత్వ రాయితీలు పొందేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. దీంతో గత చెరువులతో పాటు నాన్ ఆక్వా జోన్ పరిధితో కలిపి సుమారు 1600 ఎకరాల్లోని 547 మంది రైతులు లబ్ధి పొందుతారని కలెక్టర్ వివరించారు. ఆర్డీవో బి.శాంతి, జిల్లా మత్స్య శాఖాధికారి ఎ.వి.శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

హోరాహోరీగా..

- ఉత్సాహంగా సాగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- సత్తాచాటుతున్న పలుజట్లు
- రేపటి నుంచి జూనియర్స్ పోరు ఆరంభం





తలపడుతున్న ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్-ఏ జట్టు, గాయత్రి పీజీ కాలేజీ జట్టు క్రీడాకారులు





అంబేద్కర్ యూనివర్సిటీ, సన్ డిగ్రీ కాలేజ్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లోని దృశ్యాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గత నెల 31వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. రెండో రోజైన బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో పోటీలు జరిగాయి. పలు కళాశాలల జట్లు విజయాలతో దూసుకెళ్తున్నాయి. పలువురు ఆటగాళ్లు తమ ప్రత్యేక ప్రతిభను కనబరుస్తున్నారు. టోర్నీకి వచ్చే ఆటగాళ్లతో మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. ఔత్సాహికుల కేరింతలతో క్రీడాకారులు మరింత జోష్‌తో రాణిస్తున్నారు. సాక్షి మీడియా శ్రీకాకుళం యూనిట్ ప్రతినిధులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

● రేపటి నుంచి జూనియర్స్ పోరు..

ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీలో మొదటి మూడు రోజులు సీనియర్స్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. సీనియర్స్ విభాగంలో లీగ్ దశ పోటీలు గురువారం సాయంత్రంతో ముగియనున్నాయి. ఈ విభాగంలో క్వార్టర్స్, సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు మాత్రమే ఇంకా మిగిలి ఉంటాయి. జూనియర్స్ విభాగంలో మ్యాచ్‌లు ఈ నెల మూడో తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగో తేదీతో టోర్నీని ముగించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఏ- గ్రౌండ్ మ్యాచ్‌లు ఇలా జరిగాయి..

● 'ఆదిత్య' డిగ్రీ కళాశాల జట్టు అదరహో..

బుధవారం ఉదయం రణస్థలం శాంతినికేతన్ డిగ్రీ కళాశాల జట్టుతో జరిగిన మొదటి మ్యాచ్‌లో మూడు వికెట్ల తేడాతో శ్రీకాకుళం ఆదిత్య డిగ్రీ కాలేజ్-ఏ టీం జయభేరి మోగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన శాంతినికేతన్ జట్టు నిర్ణీత ఎనిమిది ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 57 పరుగులు చేసింది. అనంతరం 68 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆదిత్య-ఏ జట్టు ఉత్కంఠపోరులో 7.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మణికంఠ 14 బంతుల్లో 30 పరుగులు చేశాడు.

● 'శ్రీసాయిడెంటల్' ఘన విజయం

ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీ సాయి డెంటల్ కాలేజ్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలిత టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన వెంకటేశ్వర జట్టు నిర్ణీత ఎనిమిది ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీసాయి డెంటల్ కాలేజ్ కేవలం 4.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది.

● 'సన్' షైన్..

బుధవారం మధ్యాహ్నం ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం సన్ డిగ్రీ కాలేజ్ తొమ్మిది వికెట్ల తేడాతో విజయదుందుబీ మోగించింది. తొలిత టాస్ ఓడి బ్యాటింగ్ మొదలుపెట్టిన అంబేడ్కర్ వర్సిటీ జట్టు నిర్ణీత ఎనిమిది ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ మొదలుపెట్టిన సన్ కాలేజ్.. ఆదిత్య(31 పరుగులతో) రాణింపుతో 6.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే నష్టపోయి విజయాన్ని అందుకుంది.

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బీ- గ్రౌండ్ మ్యాచ్‌ల తీరు ఇలా..

● 'ఆదిత్య' పీజీ అదుర్స్..

ఉదయం ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కాలేజ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆదిత్య పీజీ కాలేజ్-బీ టీం ఎనిమిది వికెట్లతో విజయబావుటా ఎగురవేసింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన వెంకటేశ్వర ఫార్మసీ జట్టు నిర్ణీత ఎనిమిది ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 49 పరుగులు చేసింది. బదులుగా బరిలోకి దిగిన ఆదిత్య పీజీ-బీ టీం జట్టు కేవలం ఐదు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయాన్ని దక్కించుకుంది.

● వాకోవర్‌లో 'గాయత్రి' గెలుపు

రెండో మ్యాచ్‌లో శ్రీకాకుళం రూరల్ గాయత్రి డిగ్రీ కళాశాల, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్- ఏ జట్టు మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే నిర్ణీత సమయానికి అంపైర్లు గంట నిరీక్షించినప్పటికీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్-ఏ జట్టు హాజరుకాకపోవడంతో గాయిత్రి డిగ్రీ జట్టును అంపైర్లు 'వాకోవర్' విజేతగా ప్రకటించారు.

● 'ఆదిత్య' అద్భుత విజయం

మధ్యాహ్నం శ్రీకాకుళం రూరల్ పరిధి గాయత్రి పీజీ కాలేజీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్-ఏ జట్టు 20 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్-ఏ టీం నిర్ణీత ఎనిమిది ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 75 పరుగులు చేసింది. బదులుగా బరిలోకి దిగిన గాయత్రి పీజీ కాలేజ్ నిర్ణీత 8 ఓవర్లలో 55 పరుగులకే పరిమితమైంది.

నేటి మ్యాచ్‌లు ఇలా..

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఏ, బీ గ్రౌండ్‌లలో గురువారం మొత్తం ఆరు మ్యాచ్‌లు సీనియర్స్‌కు జరగనున్నాయి. ఉదయం ఎనిమిది, ఉదయం పది, మధ్యాహ్నం ఒంటి గంటకు జరగనున్నాయి.

ఏ-గ్రౌండ్‌లో: రిమ్స్ మెడికల్ కాలేజ్ శ్రీకాకుళం - కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్ శ్రీకాకుళం మధ్య ఉదయం ఎనిమిది గంటలకు పోటీ జరగనుంది.
- పది గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్-బీ జట్లు తలపడనున్నాయి.
- ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్-బీ, చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ జట్ల మధ్య మధ్యాహ్నం ఒంటి గంటకు మ్యాచ్‌లు జరగనున్నాయి.

బీ-గ్రౌండ్‌లో: ఉదయం ఎనిమిది గంటలకు శ్రీకాకుళం ఆదిత్య డిగ్రీ కాలేజ్-ఏ టీం, శ్రీకాకుళం రూరల్ పరిధిలోని గాయత్రి డిగ్రీ కాలేజ్-ఏ జట్లు పోటీ పడతాయి.
- పది గంటలకు శ్రీకాకుళంలోని ఆదిత్య పీజీ కాలేజ్-బీ జట్టు, టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్-ఏ జట్లు తలపడతాయి.
- మధ్యాహ్నం ఒంటి గంటకు రిమ్స్ మెడికల్ కాలేజ్-కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్ మధ్య జరిగే మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టుతో శ్రీకాకుళం సాయి డెంటల్ కాలేజ్ తలపడతుంది.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు నిద్దాం విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

జి.సిగడాం: నిద్దాం యూపీ పాఠశాలకు చెందిన విద్యార్థి వి.రాజేష్ త్వరలో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు (కత్తి యుద్ధం) ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు పెద్ది గోవిందరావు బుధవారం తెలిపారు. గత నెల 27, 28, 29 తేదీలో కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చినట్టు పేర్కొన్నారు. గిరిడ నవీన, కెంబూరి రాజేశ్వరి, గిరిడ లావణ్య, నేదూరుగౌతమ్, పాలిన యశ్వంత్ వెండి పతకాలు సాధించినట్టు చెప్పారు. రాజేష్ అత్యంత ప్రతిభ కనబర్చి బంగార పతకం సాధించడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. పీఈటీ రాహుల్‌కుమార్, మండల ఎంఎస్‌వో పీడీ దుర్గయ్య పర్యవేక్షణ విద్యార్థులు శిక్షణ పొందినట్టు చెప్పారు. విద్యార్థులను ఎంఈవో అరసాడ రవి, ఉపాధ్యాయులు సత్యవతి, పద్మజ, ఉమా, కూర్మారావు, సీతంరాజు, వాసుదేవరావు అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక



శిక్షణ పొందుతున్న వారితో ఎస్పీ జి.ఆర్. రాధిక

శ్రీకాకుళం రూరల్: విపత్కర పరిస్థితుల్లో, శత్రుమూకలను సమర్థవంతంగా తిప్పి కొట్టేందుకు జిల్లాలో మొట్టమొదటి సారిగా ప్రారంభించిన అర్బన్ వార్‌ఫేర్ ఫర్ స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. తండేవలసలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో స్వాట్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శిక్షణ కాలం 42 రోజులు ఉంటుందన్నారు. జిల్లా పోలీసు ప్రత్యేక విభాగానికి చెందిన 31 మంది పోలీసులతో ప్రత్యేక ఆయుధాలు, వ్యూహాలతో స్వాట్ టీమ్‌గా ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. కమాండో, గ్రేహౌండ్స్ దళాల తరహాలో అంతర్గత కల్లోహాలు, తీవ్రవాదం ముప్పు తదితర తీవ్ర పరిస్థితులను ఎదుర్కోనేందుకు ఈ దళాలు పనిచేస్తాయన్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన ఆక్టోపస్ విభాగానికి చెందినవారితో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందులో రైఫిల్ లోడింగ్, ఫిజికల్, మెంటల్ ఫిట్‌నెస్, నాయకత్వ లక్షణాలు, ఫైరింగ్ పోజిషన్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణ పొందుతున్న వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ డీఎస్పీ డి.ప్రసాద్‌రావు, యూనిట్ వైద్యాధికారి సీహెచ్ విజయ్ కుమార్, సింగుపురం పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

కొండములగాంలో పులి సంచారం!

- నాలుగు రోజులుగా పుకార్లు



కొండములగాం ప్రాంతంలో పర్యటిస్తున్న అటవీ సిబ్బంది

రణస్థలం: కొండములగాం పంచాయతీ ముక్తుంపురం గ్రామ సమీపంలోని పొలాల్లో నాలుగు రోజులుగా పెద్ద పులి సంచరిస్తోందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొంతమంది ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు ఎక్కడిదో వీడియోను వాట్సాప్ యాప్‌లో, స్టేటస్‌ల్లో పెట్టి హడావుడి చేస్తున్నారు. దీంతో బంటుపల్లి, కమ్మసిగడాం, కొండములగాం, తిరుపతిపాలెం, పున్నానపాలెం గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పుకార్లు నమ్మవద్దు

పులి సంచరిస్తున్నట్టు వచ్చిన పుకార్ల నేపథ్యంలో రణస్థలం అటవీ శాఖ సెక్షణాధికారి తలే శ్రీనివాస రావు సిబ్బందితో కలిసి కొండములగాం పరిసర ప్రాంతాల్లో రెండు రోజులు పర్యటించారు. తొలుత కొంచాలబడి గ్రామానికి చెందిన పిషిణి చిన్నంనాయుడు పులిని చూసినట్టు పుకార్లు రావడంతో అతన్ని విచారించారు. ఆతను పులి పాదముద్రగా భావిస్తున్న అడుగును అటవీ అధికారులకు చూపించారు. అయితే చిన్నంనాయుడు చెప్పిన ఆనవాళ్లు, ఆ పాదముద్ర పెద్ద పిల్లికి చెందినది అయింటుందే తప్పా పులిది కాదని అధికారులు భావిస్తున్నారు. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లోని నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో రైతులు, గొర్రెలు, మేకల కాపరులతో కూడా అటవీ సిబ్బంది మాట్లాడారు. అయితే పులి సంచారం, అరుపులు, జంతువులను తిన్న జాడ లేదని వారు స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళ చెందాల్సిన అవసరం లేదన్నారు. పుకార్లు నమ్మద్దని.. కచ్చితమైన ఆనవాళ్లు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని అటవీ అధికారులు సూచించారు. పరిశీలనలో బీట్ అధికారులు ఎస్.కె. బాషా, ఎన్. వెంకటేశ్వర్లు ఉన్నారు.

సుడాకు శాశ్వత భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సుడా (శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)కు శాశ్వత భవనం ఉండాలని, దీనికి సంబంధించిన పనులు రెండు నెలల్లో ప్రారంభించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, వైస్ చైర్మన్, జేసీ ఎం.నవీన్ ఆధ్వర్యంలో బుధవారం సుడా బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంశధార కార్యాలయం వద్ద సుమారు 30 సెంట్ల ఖాళీ స్థలంలో భవనం నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం మూడు జిల్లాల వరకు సుడా విస్తరించినందున, అందుకు తగ్గ కొత్త మ్యాపు తయారుచేయాలన్నారు. జగనన్న టౌన్‌షిప్ కింద సుడా కొనుగోలు చేసిన 150 ఎకరాల స్థలం చుట్టూ కంచె వేయాలన్నారు. ఇందులో 20 ఎకరాల స్థలాన్ని ఎంఐజీలకు కేటాయించి టెండర్లు ఆహ్వానించాలన్నారు. సుడా ప్లానింగ్ అధికారి టి.జి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ సుడా పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని 37 మండలాలు, 1647 గ్రామాలు, ఆరు మున్సిపాలిటీలతో కలిపి 5,294.68 చ.కి.మీ విస్తరించిదని వివరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు, రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.శంకర్ నాయక్, సుడా కార్యదర్శి బి.రమణమ్మ, పరిపాలన అధికారి సీహెచ్.శాంతాకుమారి, సహాయ ప్లానింగ్ అధికారి ఎం.రాధాకృష్ణ, ప్లానింగ్ కార్యదర్శులు యు.బాలభాస్కర్, ఎ.కృష్ణారావు, సీహెచ్.వెంకటరమణ, పి.వెంకటేష్, ఎం.జయంత్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 25 మేకపిల్లల మృతి

మెళియాపుట్టి : కుక్కల దాడిలో 25 మేకపిల్లలు మృతి చెందిన ఘటన చాపర గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన కిక్కర సెంబో, రంధి బలుసు, ఫల్గుణలు గ్రామశివారులో తమ మేకల మంద వేశారు. 25 మేక పిల్లలను సురక్షితంగా ఉంచి సరుకులు తెచ్చుకోవడానికి గ్రామానికి వెళ్లారు. ఇంతలో కుక్కల గుంపు లోపలికి చొరబడి పిల్లలను చంపేశాయి. ఈ ఘటనలో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు చెబుతున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు


- తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి కారణమైన బస్సు

రణస్థలం: ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ సంఘటన రావాడ జంక్షన్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రిష్ణాపురం గ్రామానికి చెందిన లింగాల నాగమణి, కమల కుమారి రణస్థలం వచ్చేందుకు రావాడ జంక్షన్‌లో రోడ్డుపక్కన నిల్చొని ఉన్నారు. రణస్థలం వైపు వస్తున్న బస్సు రావాడ జంక్షన్‌కు వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిలై రోడ్డు పక్కన నిల్చొని ఉన్న ఇద్దరు మహిళలను ఢీకొని వెళ్లి.. కొద్దిదూరంలో ఉన్న సిమెంట్ కుర్చీని, నాలుగు బైకులను ఢీకొట్టి ఆగిపోయింది. అయితే ప్రమాదం జరిగిన ప్రాంతం మలుపు కావడం.. బస్సు నెమ్మదిగా రావడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన నాగమణి, కమలకుమారిలను తొలుత రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. బస్సులో ఉన్న విద్యార్థులు క్షేమంగా ఉండడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

● అద్భుతం.. అరటిగెలల ఉత్సవం



భీష్మ ఏకాదశి పురస్కరించుకుని బుధవారం సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలో వేలాది అరటి గెలలు వేలాడాయి. స్థానికులతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి లక్ష్మీనరసింహస్వామి వారికి విశేష పూజలు నిర్వహించి అరటిగెలలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. - సంతబొమ్మాళి

ఉద్దానంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్
- ఏపీ ఈపీడీసీఎల్ పీడీ, ఫైనాన్స్ డైరెక్టర్ల హామీ



విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సాయిరాజ్

కంచిలి: రాష్ట్రంలోనే అత్యంత తుఫాన్ల ప్రభావిత ప్రాంతంగా ఇచ్ఛాపురం నియోజకవర్గం గుర్తింపబడింది. నిత్యం విద్యుత్ సమస్యలు ఈ ప్రాంతీయులను వెంటాడుతుంటాయి. విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చిందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఏపీ ఈపీడీసీఎల్ కేంద్ర కార్యాలయంలో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ సూర్యప్రతాప్, ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రంలను సాయిరాజ్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఉద్దానంలో తుఫాన్లతో తరచూ తలెత్తుతున్న ఇబ్బందులు, శాశ్వత పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను అధికారులకు వివరించినట్టు చెప్పారు. అంతకుముందు ఈ సమస్యల్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు కూడా తెలియజేసినట్టు సాయిరాజ్ గుర్తుచేశారు. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి విన్నవించిన అంశాలు ఇలా ఉన్నాయి.

- తుఫాన్ల సమయంలో విద్యుత్ లైన్లపై కొబ్బరి, ఇతర చెట్లు పడిపోతుండడంతో వారాల తరబడి కరెంటు సరఫరాకు అంతరాయం తలెత్తి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలి.
- కవిటి మండలంలోని ఉద్దానం ప్రాంత ప్రజలు నిత్యం వీచే గాలులతో విద్యుత్ అంతరాయం కలుగుతోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా బొరివంక సబ్‌స్టేషన్‌కు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇచ్ఛాపురం నుంచి రాజపురం సబ్‌స్టేషన్ మీదుగా ప్రత్యామ్నాయంగా ప్రత్యేక లైను బొరివంక సబ్‌స్టేషన్‌కు మంజూరు చేయాలి.
- కొన్ని దశాబ్దాలుగా మండల కేంద్రమైన కవిటి హెడ్‌క్వార్టర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ లేదు. దీని వలన ఏర్పడుతున్న సమస్యల్ని అధిగమించడానికి ఇక్కడ ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.
- కవిటి మండలం రాజపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జలకళ బోర్లకు ఉచితంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి.
- కవిటి మండలం కొత్తకొజ్జిరియా, పాత కొజ్జిరియా, జి.కరాపాడు గ్రామాల్లో పాడైనటువంటి విద్యుత్‌లైన్లకు కొత్త పరికరాలు మంజూరుచేసి, నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలి.

వీటిపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, సత్వరమే వీటన్నింటిని మంజూరు చేసి, పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సాయిరాజ్ వెల్లడించారు. దీంతో ఉద్దాన ప్రాంతంలో దశాబ్దాలకాలంగా ప్రజలు పడుతున్న విద్యుత్ కష్టాలకు శాశ్వతంగా తెరపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.